క్లుప్తంగా

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



పాఠశాల ప్రార్థనలో పాల్గొన్న ఎంఈఓ ధనుంజయ్య

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని చేవెళ్ల ప్రాథమికోన్నత పాఠశాలను మండల విద్యాధికారి ధనుంజయ్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలకు ప్రార్థన సమయంలోనే చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్య తక్కువ ఉండటంతో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



పాపను చూపుతున్న అంబులెన్స్ సిబ్బంది

చేగుంట(తూప్రాన్): పురుటి నొప్పులతో బాధపడుతున్న మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో 108 అంబులెన్స్‌లోనే ప్రసవించింది. మండలంలోని రాంపూర్ తండాకు చెందిన శిరీషకు గురువారం తెల్లవారుజామున పురుటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌లో ఆమెను తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్ పైలెట్ రమేశ్ ఆధ్వర్యంలో ప్రసవం చేయగా.. పాప పుట్టింది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.

లంచగొండితనం నిర్మూలిద్దాం



బహుమతులతో విద్యార్థులు

నిజాంపేట(మెదక్): కేంద్ర ప్రభుత్వ విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థ ఏపీజీవీబీ నిజాంపేట శాఖ వారి ఆధ్వర్యంలో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాంపూర్ నందు లంచగొండితనం నివారణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లంచగొండితనం మన దేశం ఆర్థిక, రాజకీయ, సామాజిక ఎదుగుదలకు అవరోధం అని, దాన్ని నిర్మూలిద్దామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ మురళీకృష్ణ, హెచ్ఎం పద్మారెడ్డి, ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, నరేశ్, కుమారస్వామి, షాదుల్, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ నిఖిల్, వెంకటేష్ బ్యాంకు మిత్రలు, సీఏ స్వప్న పాల్గొన్నారు.

నార్సింగి ఎంఈఓగా నీరజ



బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓ నీరజ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల విద్యాధికారిగా టి.నీరజను నియమిస్తూ డీఈఓ రాధాకిషన్ ఉత్తర్వులు జారీ చేశారు. చేగుంట మండల ఎంఈఓగా పనిచేస్తున్న నీరజకు అదనపు బాధ్యతలను అప్పగించారు. దీంతో నార్సింగి ఎంఈఓగా నీరజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నార్సింగి మండలంలోని పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా.. అధికారులు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించకపోవడంతో కేంద్రాల్లో ఉన్న ధాన్యం అకాల వర్షాలకు తడిసిముద్దవుతుందని బీజేపీ మండలాధ్యక్షుడు నర్సింలు వాపోయారు. ఈ మేరకు కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోళ్ల ప్రక్రియ వెంటనే ప్రారంభించి, అలాట్‌మెంట్ చేపడతామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఇచ్చిన హామీ వారం రోజులు దాటినా.. అమలు చేయకపోవడం విచారకరమన్నారు.



వెల్దుర్తిలో టపాసులు కాల్చుతున్న చిన్నారులు



పెద్దశంకరంపేటలో దీపావళి వేడుకలు



వెల్దుర్తి(తూప్రాన్): ఎం.జలాల్‌పూర్‌లో..

అంబరాన్నంటిన దీపావళి సంబురం

చీకటిని తొలగించి వెలుగులను నింపే దీపావళి పండుగను గురువారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వ్యాపార, వాణిజ్య సంస్థలతో పాటు గృహాల్లో బంతి పూలు, విద్యుత్ కాంతులతో అందంగా అలంకరించి, మట్టి దీపాలను వెలిగించారు. సాయంత్రం లక్ష్మీదేవికి పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులు, పెద్దల సమక్షంలో టపాసులు కాలుస్తూ దీపావళి శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



రామాయంపేట(మెదక్): కాట్రియాల తండాలో...



కొల్చారం(నర్సాపూర్): దీప కాంతుల్లో పైతరలోని మల్లికార్జున స్వామి ఆలయం



తూప్రాన్‌లో..



కొల్చారం(నర్సాపూర్): రంగంపేటలో..



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్‌లో..



కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లిలోని ఓ దుకాణంలో లక్ష్మీపూజ



రేగోడ్: టపాసులు కాల్చుతున్న ప్రజలు



కౌడిపల్లిలో ..

బాధిత కుటుంబానికి అండగా పీఆర్‌టీయూ

సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ



నగదును అందజేస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గెజిటెడ్ హెచ్ఎం విశ్వనాథం కుటుంబానికి పీఆర్‌టీయూ అండగా ఉంటుందని జిల్లా అధ్యక్షుడు కృష్ణ అన్నారు. మండలంలోని కుసంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్ఎంగా పని చేసిన విశ్వనాథం కుటుంబానికి అండగా నిలిచేందుకు శుక్రవారం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సుంకరి కృష్ణ, రాష్ట్ర పసీఆర్టీయూ టీఎస్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గయ్య, మండల పీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ.1లక్ష ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఒక మంచి ఉపాధ్యాయుడిని కోల్పోయమని తెలిపారు. కార్యక్రమంలో మండల పీఆర్టీయూ శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు ఎండీ అమీరుద్దీన్, సీహెచ్ సహదేవ్, కుసంగి హెచ్ఎంలు అశోక్, ఉపాధ్యాయులు కృష్ణ, సమీర్‌అలీ, బాల్యనాయక్, శ్రీకాంత్, నరేశ్ పాల్గొన్నారు.

సీపీఎం మహా సభలను జయప్రదం చేయండి

వెల్దుర్తి(తూప్రాన్): తూప్రాన్‌లో శనివారం జరగనున్న సీపీఎం 15వ మహాసభను కార్మికులు జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి గౌరీ పిలుపునిచ్చారు. ఈ మేరకు వెల్దుర్తిలో హమాలీ కార్మికులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. సీఐటీయూ కార్మికులతో పాటు సీపీఎం పార్టీకి అనుసంధానంగా ఉన్న ప్రతీ ఒక్క రంగాల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు తప్పనిసరిగా హాజరై మహాసభలు విజయవంతం చేయాలని కోరారు.

నెలలు గడుస్తున్నా గుంతలు పట్టవా..?

నర్సాపూర్: జాతీయ రహదారిపై చౌరస్తాలో గుంతలు పడి సుమారు రెండు నెలలు కావస్తున్నా.. సంబంధిత శాఖ అధికారులు వాటికి శాశ్వత మరమ్మతులు చేయకపోవడం గమనార్హం. గుంతలు ఏర్పడగానే తాత్కాలిక మరమ్మతులు చేసి, తమ పనైపోయిందని అధికారులు చేతులు దులుపుకున్నారు. కాగా వర్షాలు కురవడంతో గుంతల్లో వర్షపునీరు నిలిచి మళ్లీ యథావిధిగా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. చౌరస్తాలో ఏర్పడిన గుంతల్లో వర్షం కురిసినప్పుడు నీళ్లు నిల్వడంతో ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల పాలవుతున్నారు. కాగా ఇటీవల మున్సిపాలిటీ సిబ్బంది గుంతల వద్ద స్టాపర్లను ఏర్పాటు చేశారు. ప్రమాదాలకు కారణమవుతున్న గుంతలను శాశ్వతంగా మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నర్సాపూర్ చౌరస్తాలో ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

నర్సాపూర్ చౌరస్తా నుంచి తూప్రాన్ వెళ్లే జాతీయ రహదారి, నర్సాపూర్ చౌరస్తా నుంచి సంగారెడ్డి వెళ్లే జాతీయ రహదారిపై పట్టణ పరిధిలో వర్షం కురవగానే నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

సమాజంలో యువత పాత్ర కీలకం

● మెదక్ టౌన్ సీఐ నాగరాజు

మెదక్ మున్సిపాలిటీ: సమాజంలో యువత పాత్ర కీలకమని, విద్యార్థి దశలోనే మూఢనమ్మకాలు వీడాలని మెదక్ పట్టణ సీఐ నాగరాజు అన్నారు. ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాలతో మెదక్ టౌన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం బాలికల గురుకుల పాఠశాల కళాశాలలో మహిళల రక్షణ–సైన్సు–మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేశ్ విద్యార్థుకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలన్నారు. దొంగ స్వాములు, భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ఆర్థికంగా మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాయాలను చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా నరేశ్ మాంత్రికులు భూత వైద్యులు మోసం చేసే కుట్రలను సైన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వాటి వెనక దాగి ఉన్న రహస్యాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజయ్య, ఏఎస్ఐ కృష్ణయ్య, పోలీస్ సిబ్బంది, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ మ్యాజిక్ షో ద్వారా అవగాహన కల్పిస్తున్న నరేశ్

బగలాముఖీలో అమావాస్య పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ ఆలయంలో అమావాస్య సందర్భంగా శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. బగలాముఖీ ఉపాసకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో హరిద్వార్చన, విశేష పూజలు, హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర సంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా, సూర్యకుమార్‌గౌడ్, లక్ష్మీనర్సయ్య, తదితరులు ఉన్నారు.

ఆస్పత్రికి స్టేతస్కోప్, బీపీ చెకింగ్ మిషన్ అందజేత

మెదక్ జోన్: జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి ఓ వ్యక్తి తనవంతు సాయంగా స్టేతస్కోప్, బీపీ చెకింగ్ మిషన్‌ను అందించాడు. ఈ సందర్భంగా దాత పట్టణంలోని పిట్లంబేస్ వీధికి చెందిన చౌదరి యాదగిరి మాట్లాడుతూ.. అక్టోబర్ నెల19న తన భార్యకు కడుపు నొప్పి రావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సకాలంలో స్పందించిన వైద్యులు తన భార్య సుజాతకు ఆపరేషన్ చేసి కాపాడినట్లు తెలిపారు. ఆస్పత్రికి తనవంతుగా స్టేతస్కోప్, బీపీ చెకింగ్ మిషన్ అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.



ఆస్పత్రికి స్టేతస్కోప్ అందజేస్తున్న దృశ్యం

పశువులకు వైద్య సేవలు



టీకాలు వేస్తున్న అంబులెన్స్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

శివ్వంపేట(నర్సాపూర్): ఉచిత పశు వైద్య సేవలు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం గురించి సాక్షి దినపత్రికలో బుధవారం వైద్య సేవలు అందక ఇబ్బందులు కథనం ప్రచురితమైంది. దీంతో సంబంధిత శాఖ సిబ్బంది స్పందించి గురువారం చెండి గ్రామంలో ఉచిత సేవ అంబులెన్స్ సిబ్బంది పశువులకు టీకాలు వేశారు. ఉచిత పశు అంబులెన్స్ కోసం గతంలో ఫోన్ చేసిన పాడి రైతు ఆంజనేయులుకు సంబంధించిన పాడిగేదెలను పరీక్షించి టీకాలు వేశారు. ఈ సందర్భంగా రైతులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతీ విద్యార్థికి చదవడం రాయడం రావాలి: ఎంఈఓ

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం కచ్చితంగా రావాలని ఎంఈఓ బాలరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రావ్‌పేట ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించి, విద్యార్థులను చదవించాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీవిద్యార్థికి కచ్చితంగా చదవడం, రాయడం, కూడికలు, తీసివేతలు, గుణకారం రావాలని చెప్పారు. చదువులో వెనుకబడిన విద్యార్థిని గుర్తించి వారికి మెరుగైన విద్యను అందించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని హెచ్చరించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీడీ ఆవిష్కరణ



సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రోహిత్

శివ్వంపేట(నర్సాపూర్): మెదక్ ఎమ్మెల్యే రోహిత్ జన్మదినం సందర్భంగా మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు శివ ప్రసాద్‌గౌడ్ సీడీ తయారు చేయించగా, శుక్రవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొడకంచి శ్రీనివాస్‌గౌడ్, జంగం వెంకటేష్, గణేశ్‌గౌడ్, నర్సింలు, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్ల పంపిణీ



మెదక్‌జోన్: క్యాంపు కార్యాలయంలో కేక్‌ను కట్‌చేస్తున్న నేతలు



చిన్నశంకరంపేట(మెదక్): దుర్గామాత ఆలయంలో హోమం చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్

మెదక్‌జోన్: మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు క్యాంపు కార్యాలయంలో కేక్‌ను కట్ చేశారు. ప్రభుత్వ మాతా శిశు ఆస్పత్రిలో పండ్ల పంపిణీతో పాటు అన్నదానం చేశారు. అంతకు ముందు చర్చిలో, రామాలయంలో, దర్గాలో మత పెద్దలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, సీవన్‌రావు, పవన్, కౌన్సిలర్లు లక్ష్మీముత్యంగౌడ్, లింగం, శేఖర్, సమీ, నిఖిల్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

కొర్విపల్లి దుర్గామాత ఆలయంలో హోమం...

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కొర్విపల్లి గ్రామంలోని దుర్గామాత ఆలయంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, శివాణి దంపతులు, మైనంపల్లి హన్మంతరావు, వాణి దంపతులు హోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే రోహిత్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మెదక్ నియోజవనర్గ కాంగ్రెస్ నాయకులు సుప్రభాత్‌రావు, రామ్‌చందర్‌గౌడ్, రాజిరెడ్డి, గంగా నరేందర్, జీవన్‌రావు, పవన్, ప్రభాకర్‌రెడ్డి, మనోజ్, మోహన్‌నాయక్‌తో పాటు ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహిపాల్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రోహిత్ కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు రోహిత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ నాయకులు ఆకాంక్షరెడ్డి, మల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, పీఎసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, కృష్ణాగౌడ్, జావీద్‌పాషా, శ్రీనివాస్‌గౌడ్, పెంటాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలో కాలభైరవ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

నర్సాపూర్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు హరిప్రసాద్‌శర్మ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

శ్రీకాలభైరవ ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న గ్రామశివారులోని కాలభైరవ స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చకులు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భస్మాభిషేకం, కూష్మాండ దీపారాధన చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేందర్, మహిపాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అవకతవకలు లేకుండా సర్వే చేయాలి

● మెదక్ ఆర్డీవో రమాదేవి

రామాయంపేట(మెదక్): ఎలాంటి అవకతవకలు లేకుండా కుటుంబ సమగ్ర సర్వే నిర్వహించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని 11 వార్డులో కొనసాగుతున్న గృహాల జాబితా నమోదు ప్రక్రియను శుక్రవారం ఆమె తహసీల్దార్ రజనికుమారితో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు హౌస్ హోల్డ్ సర్వే కొనసాగుతుందని అన్నారు. ఆరు నుంచి 13 వరకు కొనసాగనున్న సమగ్ర ఇంటింటి సర్వేలో భాగంగా ఇళ్ల వద్దకు వచ్చే అధికారులకు పట్టణ ప్రజలు పూర్తి స్థాయిలో సమాచారం అందజేయాలని ఆమె సూచించారు. సర్వే కార్యక్రమం నిర్వాహణకు ఒక్కో బ్లాక్‌కు ఒక్కో ఎన్యూమరేటర్‌ను నియమించామని తెలిపారు. మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.



మున్సిపాలిటీలో కొనసాగుతున్న హౌస్ హోల్డ్ సర్వే ను పరిశీలిస్తున్న మెదక్ ఆర్డీవో రమాదేవి